RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 311 | 02 శుక్రవారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు చర్యలు: మంత్రి లోకేశ్



**అమరావతి, అక్టోబర్ 01 రాజధాని వాయిస్** : నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ (ఛీుతీఝ వాశీనివంప్త్ర) అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రిక్రూట్ మెంట్ మోడల్‌ను ఆసక్తిగా గమనిస్తోంది, మనం అనుసరిస్తున్న విధానాలనే ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు.రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. దీనిపై ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా స్పందిస్తూ... అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లుచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు జేఎస్ఎస్ యూనివర్సిటీ, థాపర్ యూనివర్సిటీ, యూపీఈఎస్, జేయూఎస్ యూనివర్సిటీ, బెన్నెట్ యూనివర్సిటీ, సవిత యూనివర్సిటీ వంటివి ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

## రాయలసీమ దశ మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్..

**లక్ష కోట్లతో బృహత్ ప్రణాళిక**
**రాయలసీమను ఫ్రూట్ బౌల్‌గా మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం**
**రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు**
**మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం**
**భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన**
**పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి**

**రేపల్లె, అక్టోబర్ 1 రాజధాని వాయిస్** : రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.




ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

### దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

## అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: సీఎం చంద్రబాబు



**రేపల్లె, అక్టోబర్ 1 రాజధాని వాయిస్** : అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు.ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, "ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి" అని అన్నారు.అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు."ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన" అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

## కోనసీమకు రైల్వే లైన్ అనుసంధానంలో కీలక ముందడుగు



**అమరావతి, రాజధాని వాయిస్‌అక్టోబర్ 01**: కోనసీమకు రైల్వేలైన్ అనుసంధానంలో కీలక ముందడుగుపడింది. కోటిపల్లి-నర్సాపూర్ రైల్వే లైన్ పనులు వేగవంతం చేసేందుకు రాష్ట్ర వాటా కింద అదనంగా కూటమి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణ, సివిల్ వర్క్ ఖర్చులతో సహా ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఈమేరకు రవాణాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల వినియోగంపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే భూసేకరణ కోసం చేసిన ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వ వాటాగానే రైల్వేశాఖ పరిగణనలోకి తీసుకోనుంది. రాష్ట్ర వాటా నిధుల కోసం వేచి చూస్తూ.. పనులు నిలిపివేయకుండా చూడాలని గతంలోనే కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఈ ప్రాజెక్టు పనులు చేపట్టాలని గతంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాశారు.

## నీటి వనరులను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదు: పవన్ కల్యాణ్



**అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 01**: నీటి వనరులను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈ ఏఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రతినిధులు డిప్యూటీ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆక్వా ప్రాసెసి ంగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు పాటించాల్సిన పర్యావరణ నిబంధనలపై పవన్ సమీక్షించారు. ఏ పరిశ్రమ అయినా పర్యావరణానికి, సమాజానికి హాని కలిగించటం ఆమోదయోగ్యం కాదన్నారు. కాలుష్యాన్ని మొదట్లోనే నివారించడం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు.ఆక్వా వ్యర్థాల కారణంగా సహజ నీటి వనరులు, భూగర్భజలాలు కాలుష్యం బారినపడకుండా జాగ్రత్తలు పాటించా లని, ప్రతీ పరిశ్రమ నిర్దేశిత ప్రమాణాలు తప్పక పాటించి తీరాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 128 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా.. 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించి పరీక్షించామని ఈ సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అందులో 49 యూనిట్లు ప్రమాణాలను పాటించడం లేదన్నారు. ఇది జలవనరులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.దీనిపై పవన్ స్పందిస్తూ.. ఇష్టారాజ్యంగా నిబంధనలు ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆక్వా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవనాధారానికి, వ్యవసాయానికి, మత్స్య సంపదకు, పర్యావరణ వ్యవస్థలకు ఈ నీటి వనరులే అత్యంత కీలకమన్నారు. పరిశ్రమలు నిర్దేశిత ప్రమాణాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ తెలిపారు. ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన సమస్యలపై చర్చించేందుకు మత్స్యకార ప్రతినిధులు, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించి, పర్యావరణ నిబంధనల అమ లు, ప్రాసెసింగ్ రంగాల స్థిరమైన అభివృద్ధి గురించి చర్చిస్తామని తెలిపారు.

## సివిల్ సర్వీసు లక్ష్యం ప్రజాసేవే

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 01 రాజధాని వాయిస్** : దేశ ప్రజలకు సేవ చేయడమే సివిల్ సర్వీసు ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సిటిజన్ ఫస్ట్ అనే భావనతో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనిచేయాలని, 'నాగరిక్ దేవోభవ' అనే ఆలోచనను తమ విధుల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సివిల్ సర్వీసు వ్యవస్థ భవిష్యత్తు దిశపై పలు కీలక సూచనలు చేశారు. దేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని అధికారులు కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలని ప్రధాని అన్నారు. నగరాల విస్తరణ, మౌలిక సదుపాయాల అవసరాలు, పెరుగుతున్న జనాభా ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత విధానాలను ప్రభుత్వ పాలనలో మరింతగా ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ సర్వీసు ఎంపిక విధానాన్ని కాలానుగుణంగా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు స్వీయ మూల్యాంకన విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం విధుల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని ఆయన అన్నారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరికి సున్నితమైన దృక్పథం అవసరమని ప్రధాని చెప్పారు. సామాన్య ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను అర్థం చేసుకొని సేవా భావంతో పనిచేసే అధికారులు దేశాభివృద్ధికి బలమైన పునాది అవుతారని అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇవ్వాలంటే ఉద్యోగుల అంకితభావం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## బీసీల 34 శాతం రాజకీయ హక్కు కోసం చివరి వరకూ పోరాడతాం



**అమరావతి, రాజధాని వాయిస్** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి జీవోలను హైకోర్టు కొట్టివేయడం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుతో బీసీల రాజకీయ హక్కుల కోసం చేస్తున్న పోరాటం ఆగిపోదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 34 శాతం బీసీ రిజర్వేషన్ కోసం న్యాయపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటుందని, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. బీసీల రాజకీయ సాధికారత విషయంలో తెలుగుదేశం పార్టీ చరిత్ర ఎవ్వరూ చెరిపేయలేరని అచ్చెన్నాయుడు అన్నారు. 1987 చట్టసవరణల ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించింది తెలుగుదేశం పార్టీనే, 1995లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టసవరణ ద్వారా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో బీసీలకు 34 శాతానికి తగ్గకుండా రాజకీయ రిజర్వేషన్ కల్పించే నిబంధన తీసుకొచ్చింది కూడా తెదేపానే అని గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ అవకాశాలు ఇవ్వడం తెలుగుదేశం పార్టీకి కొత్త కాదు. బీసీలకు 20 శాతం రాజకీయ రిజర్వేషన్ నుంచి 34 శాతం వరకు హక్కు కల్పించిన చరిత్ర మాది. బీసీలను అధికారంలో భాగస్వాములను చేయాలన్నది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అని మంత్రి పేర్కొన్నారు.

# వివేకానంద పాఠశాలలో వ్యాసరచన పోటీలు




**పిడుగురాళ్ళ.అక్టోబర్ 01, రాజధాని వాయిస్:** గాంధీ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా,పిడుగురాళ్ల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురులో ఉన్న వివేకానంద పబ్లిక్ స్కూల్ లో జాతిపిత మహాత్మా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా వ్యాస రచన పోటీలు నిర్వహించటం జరిగింది.దీనిలో 6నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ మాస్టార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యలమందా రెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. 1) శ్రీరామ్ లక్ష్మీ నారాయణ 2) నూతక్కి వైష్ణవి 3)సింగంశెట్టి మోక్ష 4) మునగా ఇందు ప్రియ 5) నల్లమేకల మణికంఠ బహుమతులు అందుకున్నారు.

# పారిశుద్ధ్య పనుల పరిశీలించిన మునిసిపల్ కమీషనర్



**పిడుగురాళ్ల.అక్టోబర్ 01,రాజధాని వాయిస్:**గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచనల మేరకు పిడుగురాళ్ల పట్టణంలోని కళ్యం టౌన్షిప్, ధర్మక్షేత్ర అపార్ట్మెంట్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని నోట్ చేసుకొని వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్,ప్రదాన కార్యదర్శి గుర్రం కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి యూత్ జనరల్ సెక్రటరీగా బత్తుల



**పిడుగురాళ్ళ.అక్టోబర్ 01,రాజధాని వాయిస్:** వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పిడుగురాళ్ల మండల యువజన విభాగం యూత్ జనరల్ సెక్రెటరీగా కరాలపాడు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావును నియమించినందుకు గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ బాధ్యతను అప్పగించేందుకు సహకరించిన మండల నాయకులు చింతా సుబ్బారెడ్డి, చల్లా శివారెడ్డి రెడ్డి, బోల్నేడి సాంబశివరావు కు ప్రత్యేక కృతజ్ఞతలు, ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# అమెరికాలో క్యాన్సర్‌తో పోరాటం.. మాతృభూమికి రావాలని ఏపీ యువకుడి కోరిక



**అమరావతి, రాజధాని వాయిస్ :** ఉన్నత విద్య అభ్యసించి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అమెరికా వెళ్లిన ఓ యువకుడికి ఊహించని పరిణామం ఎదురైంది. కొన్ని నెలలకే క్యాన్సర్ అని తేలింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో స్వస్థలానికి వచ్చి కుటుంబీకులు, ఆత్మీయులతో గడపాలని ఉందని.. ఇందుకు ప్రభుత్వం సాయం చేయాలని బాధితుడు కోరాడు. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. బాధిత కుటుంబంతో మాట్లాడినట్లు చెప్పారు.ఏపీకి చెందిన భరత్ పులిపాటి.. ఐదేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. ఏడాది తర్వాత ప్రాణాంతక హెపటో సెల్యులార్ కార్సినోమా (కాలేయ క్యాన్సర్) బారిన పడినట్లు తేలింది. దీంతో నాలుగేళ్ల నుంచి అక్కడే చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల ఆరోగ్యం విషమించడంతో టెక్సాస్‌లోని ఓ ఆసుపత్రిలో చేరారు. సోదరి ఆయనకు అండగా నిలుస్తున్నారు.ఈ దశలో మాతృభూమికి రావాలని ఉందని.. మిగతా జీవితాన్ని అక్కడే గడపాలని ఉందని చివరి కోరికను వెల్లడించారు. అయితే, అనారోగ్యం దృష్ట్యా సాధారణ కమర్షియల్ విమానంలో ప్రయాణించడం సురక్షితం కాదని, ఎయిర్ అంబులెన్స్ సాయం అవసరమని చెప్పాడు. ఈ మేరకు ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ భరత్ ఓ వీడియో విడుదల చేశారు.దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. భరత్ సోదరితో మాట్లాడినట్లు చెప్పారు.

# పేదల సేవలో కార్యక్రమానికి విశేష స్పందన

**- లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ**

**- టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

**- సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం: మంత్రి అచ్చన్నాయుడు**

**కోటబొమ్మాళి, రాజధాని వాయిస్ :** శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడులో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్వయంగా పంపిణీ చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా చేరేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ చేపడుతూ ఎన్టీఆర్ భరోసా పథకాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన సంక్షేమ కార్యక్రమంగా తీర్చిదిద్దినట్లు మంత్రి పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజల సేవకే తమ జీవితం అంకితమైందని, శక్తి ఉన్నంత వరకు సేవ చేస్తామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అచ్చన్నాయుడు అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాలు, పోలీసు ఉద్యోగాల భర్తీ, పరిశ్రమల స్థాపన ద్వారా భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు అచ్చన్నాయుడు వెల్లడించారు. 2028 నాటికి ప్రతి గ్రామంలో నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టి హిరమండలం జలాశయం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని చెప్పారు. నేరడి బ్యారేజీ పనులను వేగవంతం చేసి భారీ స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు ఏడాది పొడవునా సాగునీరు అందించడంతో పాటు మూడు పంటల సాగుకు అనుకూల పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పాలనకు మూల సూత్రమని ఆయన స్పష్టం చేశారు.



# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో మంత్రి పయ్యావుల కేశవ్



**కూడేరు, రాజధాని వాయిస్ :** ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి గ్రామంలో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారుల వద్దకు స్వయంగా వెళ్లి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుల తో మమేకమై వారి కుటుంబ పరిస్థితులు, సంక్షేమ పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షలాది మంది లబ్ధిదారులకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. పెన్షన్ల పంపిణీని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు కేవలం ఆర్థిక సహాయానికే పరిమితం కావని, సామాజిక భద్రతను కల్పించే సాధనంగా మారాయని మంత్రి అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఈ పెన్షన్లు దోహదపడుతున్నాయని వివరించారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిమ్మాపురంలో రహదారి పనులకు శంకుస్థాపన

**- శ్రీ నూకాలమ్మ తల్లిని దర్శించుకున్న హోంమంత్రి అనిత**

**- పల్లె పండగ 3.0లో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**- గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

ఎస్.రాయవరం, అక్టోబర్ 1 : ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామంలో హోంమంత్రి అనిత పర్యటించి శ్రీ నూకాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లె పండగ 3.0 కార్యక్రమంలో పాల్గొని గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామంలో వి.బి.జి. రామ్ జి నిధుల ద్వారా రూ.99.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు హోంమంత్రి అనిత శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది అని పేర్కొన్నారు. గ్రామాల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో సుమారు రూ.40 కోట్ల నిధులు గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించబడుతున్నాయని హోంమంత్రి అనిత వెల్లడించారు. ఈ నిధుల ద్వారా రహదారులు, మౌలిక సదుపాయాలు, ప్రజా అవసరాలకు సంబంధించిన పలు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పల్లె పండగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు వేగం



పెరిగిందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడేలా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

**- జలజీవన్ మిషన్ కార్యక్రమానికి ప్రొద్దుటూరుకు రానున్న ముఖ్యమంత్రి**

**- సభా ప్రాంగణం, భద్రత, మౌలిక వసతులపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**





**ప్రొద్దుటూరు, రాజధాని వాయిస్ :** జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రొద్దుటూరు లోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షించిన కలెక్టర్, ప్రతి విభాగం తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, వైద్య ఆరోగ్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య, అగ్నిమాపక బృందాలు సిద్ధంగా ఉండేలా చూడాలని తెలిపారు. సమీక్ష సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, ఇతర జిల్లా అధికారులతో కలిసి బహిరంగ సభ ప్రదేశం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా తాగునీటి రంగంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే విధంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటనను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏపీలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో 807 మద్యం దుకాణాలకు కొత్తగా లైసెన్సుల జారీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో మూడు రోజులు పొడిగించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి అదనపు అవకాశం కల్పిస్తూ అక్టోబర్ 6 అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబర్ 7న దరఖాస్తుల పరిశీలన చేపట్టి, అర్హత కలిగిన దుకాణాలకు అక్టోబర్ 8న డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించి లైసెన్సులు కేటాయించనున్నట్లు అబ్కారీ, మద్య నిషేధ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాజా కేటాయింపుల కోసం గుర్తించిన 807 ఏ4 దుకాణాల్లో 799 ఓపెన్ కేటగిరీ, 8 రిజర్వుడ్ కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. పునరుద్ధరణ జరగని.. ప్రస్తుతం పనిచేయని దుకాణాల స్థానంలో ఈ తాజా కేటాయింపులు చేపడుతున్నారు. ఒక దుకాణానికి నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు సమర్పించొచ్చు. రూ.3 లక్షలు నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించాలి. ఓపెన్ కేటగిరిలోని దుకాణాల కోసం https://oc.hpfsproject.com పోర్టల్‌లో, కల్లు గీత కార్మికులకు రిజర్వు చేసిన దుకాణాల కోసం https://gk.hpfsproject.com పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంపు

**అమరావతి, రాజధాని వాయిస్ :** బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. 3-6వ తరగతి విద్యార్థుల డైట్ ఛార్జీలు రూ.1150 నుంచి 1265కు పెంచారు. 7-10వ తరగతి విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600, ఇంటర్, ఆపై తరగతి విద్యార్థులకు రూ.1600 నుంచి రూ.1800కు పెంచారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేయనున్నారు. వారంలో ఆరు రోజులు గుడ్లు, మూడు రోజులు చికెన్.. రోజూ పాలు, పండ్లు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపుపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# గొడ్డలిపార్టీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటోంది: సీఎం చంద్రబాబు



**రేపల్లె, రాజధాని వాయిస్ :** బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పుపై సీఎం చంద్రబాబు స్పందించారు. రిజర్వేషన్ల విషయంలో బీసీలకు ఇబ్బంది లేకుండా.. సుప్రీంకోర్టుకు వెళ్తున్నట్లు బాపట్ల జిల్లా రేపల్లె ప్రజావేదిక సభలో ప్రకటించారు. ఎన్టీఆర్ కాలం నుంచి బీసీలకు అండగా ఉండి.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేశామని గుర్తు చేశారు. గొడ్డలి పార్టీ.. బీసీ రిజర్వేషన్లు కత్తిరించి 24శాతానికి తగ్గించిందని ఆరోపించారు. తాజాగా మళ్లీ 34 శాతానికి రిజర్వేషన్లు పెంచినా.. గొడ్డలి పార్టీ దీనిపై కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లు అడ్డుకుందని విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క టీచర్ ఉద్యోగమూ ఇవ్వని వారు డీఎస్సీపై విమర్శలు చేస్తున్నారని.. డీఎస్సీపై 300 కేసులు వేసి అడ్డుకోవాలని చూశారని దుయ్యబట్టారు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా ఇదే విధంగా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

# ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కాలేజీలో వాటర్ ప్యూరిఫైయర్స్ ప్రారంభం

**గుంటూరు, రాజధాని వాయిస్ :** విద్యతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే దిశగా విద్యాబోధన జరగాలని ప్రముఖ వ్యాపారవేత్త, సేవా తత్పరులు త్రిపురమల్లు అరుణ్ కుమార్ పేర్కొన్నారు.ఈనెల 1వ తేదీన గుంటూరు నల్లపాడు లోని ఎం బి టి ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రాంగణంలో 4 నీటి శుద్ధి యంత్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన త్రిపురమల్లు అరుణ్ కుమార్ ప్రసంగిస్తూ విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేందుకు గాను నాలుగు శుద్ధ జల యంత్రాలను విరాళంగా అందించడం జరిగిందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు సినీ కథానాయకులు, రాజకీయ నాయకులను అనుకరిస్తూ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా చదువులపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ మూడేళ్లు కష్టపడి చదివితే భవిష్యత్తు సుందరంగా ఉంటుందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య తో విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు దేశానికి కూడా భారంగా మారకూడదని తెలిపారు.జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గుంటూరు నగరంలో స్వచ్ఛంద సేవా సంస్థలను, సామాజికవేత్తలను, సేవా తత్పరులను సమన్వయ పరచుకుంటూ పలు వైవిద్యమైన కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు సైతం చురుగ్గా పాల్గొనడం శుభపరిణామం అన్నారు.సేవారంగంలో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తున్న త్రిపురమల్లు అరుణ్ కుమార్ అభినందనీయులు, ఆదర్శప్రాయులని తెలిపారు. నిధుల లేమి సేవా సంస్థలకు ప్రతిబంధకంగా మారకూడదని, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సాయంతో పాటు సమయ దానం కూడా చేయాలని కోరారు.మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి ప్రసంగిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు నైపుణ్యాలను, నైతిక విలువలను పెంపొందించేలా వ్యక్తిత్వ వికాస నిపుణులచే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నగరంలో వరుసగా మూడో ఏడాది ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు నిర్వహించటం సంతోషకరమని పేర్కొన్నారు.ఎం బి టి ఎస్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ తాళ్లూరి శేఖర్ ప్రసంగిస్తూ తమ కళాశాల అవసరార్థం నాలుగు వాటర్ ప్యూరిఫైయర్స్ అందజేసిన త్రిపురమల్లు అరుణ్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు రానున్న రోజుల్లో సామాజిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని సమాజాభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ఎం బి టి ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు టి. ఉమామహేశ్వరరావు చొరవ తీసుకుని 75 వేల రూపాయల విలువ చేసే శుద్ధ జల యంత్రాల అవసరాన్ని గమనించి 1300 మంది విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించడానికి కృషి చేయడం అభినందనీయమని అతిథులందరూ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యవర్గ సభ్యులు సూరం నారాయణరెడ్డి, మేకల రామారావు, డైరెక్టర్ నల్లమోతు సాంబశివరావు, నేస్తం సహ వ్యవస్థాపకులు తమ్మా ధనుంజయ రెడ్డి, ఎం బి టి ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విభాగాధిపతులు పి. అనురాధ, డాక్టర్ జి.వి. సురేష్, డాక్టర్ సి.హెచ్. మోసెస్ అరవింద్, అధ్యాపక సిబ్బంది డాక్టర్ కె. శ్రీవల్లి రాణి, మహమ్మద్ అలీ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# మలినేని కాలేజీలో ముగిసిన ఆరు రోజుల రోబోటిక్స్ శిక్షణ



**గుంటూరు, రాజధాని వాయిస్ :** మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, టెక్కీబోట్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఆరు రోజుల రోబోటిక్స్ శిక్షణా కార్యక్రమం ఘనంగా ముగిసింది.ఈ శిక్షణలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై ప్రయోగాత్మక అవగాహన కల్పించడంతో పాటు, స్వయంచాలకంగా పనిచేసే రోబోలను నిర్మించడం, త్రిమితీయ నమూనాలను రూపొందించడం వంటి అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ అనువర్తనాల కోసం విద్యార్థులు విభిన్న రోబోటిక్ నమూనాలను రూపొందించారు .విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, బృంద స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో రోబోటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు మొత్తం రూ.20,000 నగదు బహుమతులు అందించి సత్కరించారు.ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా. ఎం. పెరుమాళ్లు, డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డా. డి. విజయసారధి, ప్రిన్సిపాల్ డా. జె. అప్పారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.చైర్మన్ డా. ఎం. పెరుమాళ్లు విద్యార్థులు రోబోటిక్స్‌లో ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకుని, నూతన ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చాలని సూచించారు. డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు విద్యార్థులు రూపొందించిన స్వయంచాలక రోబోలు, త్రిమితీయ నమూనాలను అభినందిస్తూ, వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాలకు ఉపయోగపడే పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు.విభాగాధిపతి డా. డి. విజయసారధి ఆరు రోజుల శిక్షణలో విద్యార్థులు చూపిన ఆసక్తి, కృషి, సృజనాత్మకత మరియు బృంద స్ఫూర్తిని అభినందించారు. అన్ని బృందాలు పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించినందుకు అభినందనలు తెలిపారు.ప్రిన్సిపాల్ డా. జె. అప్పారావు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అన్ని బృందాల విద్యార్థులను అభినందిస్తూ, ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను భవిష్యత్ ప్రాజెక్టులు మరియు నూతన ఆవిష్కరణల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో ప్రత్యక్ష అనుభవం, సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన మరియు ఆవిష్కరణ దృక్పథాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడింది.

# బీసీ రిజర్వేషన్ల జీవోల రద్దుపై వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మీడియా సమావేశం



**గుంటూరు, రాజధాని వాయిస్ :** సుప్రీంకోర్టు ధర్మాసనం 2010 లోనే స్థానిక సంస్థలకు రిజర్వేషన్ 50 శాతం మించరాదని స్పష్టంగా తెలియజేసినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల ప్రజలను మభ్యపెట్టడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 105 జీవో, 1065 జీవోలను విడుదల చేసిందని ఈనెల 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ జీవోలను రద్దుచేసి 6 వారాలలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఈనెల 1వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు.తమిళనాడు ప్రభుత్వం 1993 – 94 లో రిజర్వేషన్లు 69 శాతం ఉండాలని చట్టం తేవడం 1994లో పార్లమెంట్ 76వ రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడులో రిజర్వేషన్ 69 శాతానికి వర్తింపచేస్తూ 9 వ షెడ్యూల్ చేర్పించి గత 30 సంవత్సరాలుగా అమలు చేస్తున్న తీరును గమనించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 105, 1065 జీవోల ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ లు స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని ప్రయత్నించడం అవివేకమని, బీసీలను మభ్యపెట్టడానికే అని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు.డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ పూర్తి కాకుండానే, నివేదిక అందకుండానే, అసెంబ్లీలో చట్టశీను రూపొందించకుండా 34 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. ఇదే ప్రయత్నం 2019 – 20 లోనాటి వైఎస్సార్ సిపి ప్రభుత్వం కూడా చేసి అభాసు పాలైందన్నారు.1992లోనే 9 మందితో కూడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ 50 శాతం దాటకూడదని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పు పై సుప్రీంకోర్టుకు వెళ్లాలనే ఆలోచనను విరమించుకుని డెడికేటెడ్ కమిషన్ నివేదికను సిద్ధం చేసుకుని, అసెంబ్లీలో చట్టశీ రూపొందించి, పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ కోసం పోరాడాలని గుర్తు చేశారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు వరకు పోరాటం..ఎమ్మెల్యే!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** బీసీ రిజర్వేషన్ల అమలుకు సుప్రీంకోర్టు వరకు వెళ్ళి పోరాడతామని, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంపు కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ నిర్వహించి మహిళల నుంచి వినతులు స్వీకరించారు.మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు.బీసీ రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టివేసి ఎన్నికలు యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేసిందని, అయినప్పటికీ బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, పేదల అభ్యున్నతికి టీడీపీ ఎప్పుడూ కట్టుబడి ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం కొందరు వక్రీకరించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదన్నారు.మహిళా సాధికారత విషయంలో కూడా కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని కూటమి నాయకత్వం బహిరంగంగా ప్రకటించిందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ అదే నిబద్ధతతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు.

# ఎన్టీఆర్ పింఛన్లు ప్రతి అవ్వాతాతకు భరోసా, గౌరవం..ఎమ్మెల్యే!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** ఎన్టీఆర్ పెన్షన్లు ప్రతి అవ్వాతా తకు భరోసా, గౌరవం అందిస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి "పేదల సేవలో 2.0" కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ కన్నవారి తోట 1వ లైన్‌లోని 80వ సచివాలయం పరిధిలో ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ లో ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే రాష్ట్రంలోని అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు, మంచానికే పరిమితమైన వారు ఎంతో ఆతృతగా ఎదురుచూసే రోజు అని అన్నారు. ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు ఒక పండుగలా మారిందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెన్షన్ల విషయంలో అత్యంత మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని, ఒకటో తేదీ సెలవు రోజు అయినా కూడా లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ముందుగానే పెన్షన్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ నెల 20,800 మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.8.90 కోట్ల విలువైన పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు.పెన్షన్లు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మందుల కోసం, నిత్యావసరాల కోసం, కుటుంబ భరోసా కోసం ఈ పెన్షన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా కొడుకులు లేని కుటుంబాల్లో కుమార్తెల వద్ద ఉంటున్న వృద్ధులకు ప్రభుత్వం ఒక పెద్దన్నలా అండగా నిలిచి గౌరవప్రదమైన జీవితం అందిస్తోందనే భావన కనిపిస్తోందన్నారు. దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్లు వారికి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని, డయాలసిస్ బాధితులకు నెలకు రూ.10 వేల చొప్పున అందిస్తున్న ఆర్థిక సాయం వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని చెప్పారు. అలాగే మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15 వేల చొప్పున అందిస్తున్న పెన్షన్ నిజంగా ఆ కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఒక సామాన్య కుటుంబం నెలంతా కష్టపడితే వచ్చే ఆదాయానికి సమానమైన మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా అందించడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. ప్రజలకు ఇంతటి గౌరవం, భరోసా, ఆర్థిక రక్షణ కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకే ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రజల హృదయాలను గెలుచుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం సహించం.. ఎమ్మెల్యే గళ్ళా మాధవి!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** పిల్లలు చదివే పాఠశాలలు దేవాలయాల వంటివని, పరిశుభ్రమైన వాతావరణంలో చదివించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం నగరంపాలెంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినుల హాజరు, పాఠశాలలోని మౌలిక వసతులు, తరగతి గదుల పరిస్థితిని పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థినులు తరగతి గది లేక బయట కూర్చొని చదువుకోవడం, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడం, కంప్యూటర్ ల్యాబ్ శిథిలావస్థలో ఉండడం గమనించిన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పర్యటన సమాచారం అందుకుని ఎంఈఓ నాగేంద్రమ్మ పాఠశాలకు చేరుకోగా, పాఠశాల కరస్పాండెంట్, ఎంఈఓ మధ్య సరైన సమన్వయం లేకపోవడాన్ని కూడా ఆమె తప్పుబట్టారు.అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గతంలోనూ ఈ పాఠశాల, ఎస్సీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఒకప్పుడు వేలాది మంది బాలికలు చదువుకున్న స్టాల్ గర్ల్స్ హైస్కూల్ పశ్చిమ నియోజకవర్గంలోనే అత్యంత ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిందన్నారు. అయితే కాలక్రమేణా నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలకు వెళ్లే రహదారి సరిగా లేకపోవడం, గతంలో సూచించినప్పటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, బాలికల హాస్టల్ పరిసరాలు అడవిని తలపించేలా ఉండడం ఆందోళన కలిగించే అంశాలని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.పెద్ద పెద్ద తరగతి గదులు ఉన్నప్పటికీ వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తూ విద్యార్థినులను బయట కూర్చోబెట్టడం సరికాదని, వెంటనే వారికి ప్రత్యేక తరగతి గదులు కేటాయించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించినట్లు తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్ నిర్వీర్యంగా మారడం, స్టోర్‌రూములు అధ్వాన్నంగా ఉండడం, కొన్ని తరగతి గదుల్లో సరిపడా ఫ్యాన్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్న విషయాలను కూడా ప్రస్తావించారు. ఈ పాఠశాల ఎయిడెడ్ సంస్థ కావడంతో ప్రభుత్వ నిధుల పరంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, యాజమాన్యం పూర్తి బాధ్యతతో వ్యవహరించి సంస్థకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.ప్రస్తుతం ఎలక్ట్రికల్ పనులతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎమ్మెల్యే సూచించిన అంశాలను వారం రోజుల్లో సరిదిద్దుతామని పాఠశాల ప్రిన్సిపాల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత మరోసారి పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు, యాజమాన్యం, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌కు తప్పకుండా పూర్వ వైభవం వస్తుంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

# గుంటూరు నూతన డీఎంహెచ్‌వోగా డాక్టర్ ఎం. పద్మావతి బాధ్యతల స్వీకరణ!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణిగా డాక్టర్ యం. పద్మావతి, సివిల్ సర్జన్, ప్రభుత్వ జ్వరముల వైద్యశాల, గుంటూరు, గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ యం. పద్మావతి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థల ద్వారా అందుతున్న సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. ప్రతి స్థాయిలో విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజారోగ్య పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తమ వంతు కృషి చేయాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ, టీకా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ, అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు మరియు నియంత్రణ, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అలాగే జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య ఆరోగ్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డాక్టర్ యం. పద్మావతి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఇతర ఆరోగ్య సంస్థల్లో సేవల నాణ్యతను మెరుగుపరచడంలో సమిష్టి కృషి అవసరమన్నారు.

**ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సమిష్టి కృషి**

జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖలోని ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం కలిగించేలా సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.బాధ్యతల స్వీకరణ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ప్రోగ్రామ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ యం. పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, ప్రస్తుత పరిస్థితులు మరియు చేపడుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులు ఆమెకు వివరించారు.జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులందరి సహకారంతో సమన్వయపూర్వకంగా ముందుకు సాగుతామని డాక్టర్ యం. పద్మావతి తెలిపారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ

**వినుకొండ, రాజధాని వాయిస్** : పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ సీఐ ప్రభాకర్‌తో కలిసి బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన ఆయన ప్రయాణికుల భద్రత, వాహనాల రాకపోకలపై డిపో మేనేజర్ రమణమ్మ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.బస్టాండ్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద వాహనాలు వేగంగా రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్ కు సూచించారు. ముఖ్యంగా బస్టాండ్ పరిధిలో మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని,,బస్టాండ్‌లోకి ప్రవేశించే, బయటకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు అతివేగంగా నడపకుండా డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు.ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ డ్రైవర్లు తప్పనిసరిగా వేగ నియంత్రణ పాటించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు బస్టాండ్‌లో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా



తీసుకోవాల్సిన చర్యలపై డిపో మేనేజర్ కు పలు సూచనలు చేశారు. అనుకోని ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ తెలిపారు . బస్టాండ్‌లో భద్రతా పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

# అక్టోబర్ 2న స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026 ప్రదానోత్సవం

**గుంటూరు, రాజధాని వాయిస్** స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026 బహుకరణ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (SASA) కార్యక్రమం కింద స్వచ్ఛత కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వారిని గుర్తించి, ప్రోత్సహించేందుకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్.ఆర్.ఆర్ (Reduce--Reuse--Recycle) విధానం, పర్యావరణహిత, సుస్థిర పద్ధతుల అమలులో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డులను అందజేస్తున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఒక రాష్ట్రం 26 విభాగాల్లో సమగ్ర స్వచ్ఛత సర్వే నిర్వహించడం విశేషమన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్స్ తరహాలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్‌ను సంస్థాగతం చేసి, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అత్యుత్తమ పనితీరును గుర్తించడంతో పాటు, స్వచ్ఛత భావనను ప్రజలు, సంస్థలు, అన్ని వర్గాల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లేలా ప్రోత్సహించడం జరుగుతోందని వివరించారు.



**మూడు దశల్లో అవార్డుల ఎంపిక**

స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026లో రేటింగ్/ర్యాంకింగ్ ప్రక్రియను మూడు దశల్లో - స్వీయ మూల్యాంకనం, జిల్లా స్థాయి అధికారుల ధృవీకరణ, మూడవ పక్షం మూల్యాంకనం (థర్డ్ పార్టీ అసెస్‌మెంట్) నిర్వహించారని తెలిపారు.

మొత్తం 1,58,933 కేంద్రాలు స్వీయ మూల్యాంకనంలో పాల్గొన్నాయని చెప్పారు. వాటిలో 1,50,150 కేంద్రాల్లో జిల్లా స్థాయి ధృవీకరణ నిర్వహించారని, వీటిలో 1,960 జిల్లా స్థాయి నుండి

నామినేషన్లు ఎంపికయ్యాయని తెలిపారు. చివరకు 101 ఎంట్రీలు రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం పోటీపడ్డాయని అన్నారు. ఈ మొత్తం మూల్యాంకన ప్రక్రియను స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (SASA) పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌కు అనుసంధానించి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించారని పేర్కొన్నారు.

**వివిధ విభాగాల్లో అవార్డులు**

స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026లో స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్‌స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు తదితర అనేక విభాగాల్లో అవార్డులను అందజేస్తున్నారని తెలిపారు.

**జిల్లా స్థాయి అవార్డుల ప్రధానం**

అక్టోబర్ 2వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల శంకరన్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026 జిల్లా స్థాయి విజేతలను సత్కరించడం జరుగుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైన విజేతల వివరాలు సాసా పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా స్థాయి అవార్డు విజేతల వివరాలను కూడా SASA పోర్టల్ (https://sasa. ap.gov.in/) ద్వారా పొందవచ్చన్నారు.

**విజేతల వివరాలు**

స్వచ్ఛ గ్రామ పంచాయతీలు - వడ్లమూడి, సీతారాంపురం, పొన్నెకల్లు, నంది వెలుగు

స్వచ్ఛ ఎస్ ఎల్ ఎఫ్ - దీపం ఎస్ఎల్ఎఫ్ (ఆత్మకూరు, మంగళగిరి), గుజ్జనగుండ్ల ఎస్ఎల్ఎఫ్ (గుజ్జనగుండ్ల, గుంటూరు) ఐతనగర్ మహిళా స్లం సమాఖ్య (లంకదిబ్బ, తెనాలి)

గ్రామ సమాఖ్యలు - గుంటూరు - ఫిరంగిపురం - హౌస్ గణేష్, గుంటూరు - - పొనుగుపాడు, గుంటూరు - పొన్నూరు - మునిపల్లె, గుంటూరు - తాడికొండ - బందరుపల్లి, గుంటూరు - తాడికొండ - తాడికొండ

స్వచ్ఛ పాఠశాలలు - వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నెక్కల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెంగళరావు నగర్ పురపాలక ఉన్నత పాఠశాల

స్వచ్ఛ అంగన్వాడీలు - నల్లపాడు (ఎస్సీ) అంగన్వాడి కేంద్రం, గుంటూరు 13 వార్డు ఒకటవ కేంద్రం, కృష్ణానగర్ మూడవ కేంద్రం, రాయపూడి అంగన్వాడి కేంద్రం, 19వ వార్డు ఎస్టి కాలనీ అంగన్వాడి కేంద్రం

స్వచ్ఛ ఆస్పత్రులు - తెనాలి సిహెచ్ సి, ప్రత్తిపాడు సిహెచ్సి, కొల్లిపర సిహెచ్సి, తాడికొండ జిహెచ్ది, గుంటూరు జియుడి, వట్టిచెరుకూరు పీహెచ్సీ, ఈమని పీహెచ్సీ, కాట్రపాడు పీహెచ్సీ, ఎర్రబాలెం యు పి హెచ్ సి, బృందావన్ గార్డెన్స్ యూపీహెచ్సీ, చౌడవరం యూపీహెచ్సీ

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు - గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పరిషత్ కార్యాలయం, జిల్లా అటవీ శాఖ కార్యాలయం

స్వచ్ఛ బస్ స్టేషన్ - మంగళగిరి బస్ స్టేషన్ స్వచ్ఛ రైతు బజార్ - తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతు బజార్

స్వచ్ఛ వసతి గృహాలు - ప్రత్తిపాడు సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, గుంటూరు ప్రభుత్వ బిసి కళాశాల బాలుర వసతిగృహం, గుంటూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహం, మైనార్టీ సంక్షేమ వసతిగృహం

ఉత్తమ స్వచ్ఛ స్వచ్ఛంద సంస్థలు - మేయర్స్ హోమ్, మహిళ సిస్ సంక్షేమ శాఖ

స్వచ్ఛ వారియర్స్ - మేకల జాలయ్య, అల్లం శ్రీనివాసరావు, ఎర్రం శెట్టి గురుమూర్తి, పొట్నూరి సాంబయ్య, గండికోట సీతయ్య

స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్లు - చింత అలేఖ్య, రేటూరి వేణు, వంకాయలపాటి శోభ, చిలక యేసు మరియమ్మ, గొడవర్తి నాగరాజు

స్వచ్ఛ గురుకులం - తెనాలి హెచ్ సి గురుకులం (బాలికలు)

స్వచ్ఛ పర్యాటక ప్రదేశం - ఉండవల్లి గుహలు

స్వచ్ఛ పార్క్ - కొండపనేని టౌన్షిప్ పార్క్ (ఎంటిఎంసి)

స్వచ్ఛ ఆధ్యాత్మిక ప్రదేశం - వెంకటపాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (టిటిడి)

స్వచ్ఛ వాణిజ్య ప్రదేశం - హోటల్ వెంకటేష్ గ్రాండ్ (ఆరండల్ పేట)

స్వచ్ఛ రథం - పొన్నూరు మండలం

స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026 విజేతలను అభినందిస్తూ, స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (SASA) ఉద్యమాన్ని మరింత ఉత్సాహంతో, సమష్టిగా, నిబద్ధతతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఈ-ఆటోలతో నూరు శాతం చెత్త సేకరణే లక్ష్యం

**గుంటూరు,రాజధాని వాయిస్** : గుంటూరు నగరంలో ఈ-ఆటోల సమర్థవంతమైన వినియోగం ద్వారా నూరు శాతం చెత్త సేకరణ పక్కాగా జరిగేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో ఈ-ఆటోల సద్వినియోగం, నగరంలో నూరు శాతం చెత్త సేకరణ విధానాలపై ప్రజారోగ్య అధికారులు, ఈ-ఆటోల ఏజన్సీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలోని ప్రతి ఇల్లు, కమర్షియ ల్ సంస్థలు మరియు వ్యాపార సముదాయాల నుండి వ్యర్థాల సేకరణ నూరు శాతం జరగాల్సిందేనని స్పష్టం చేశారు. నగరంలో ఏ ఒక్కటి మినహాయింపు లేకుండా చెత్త సేకరణ ప్రక్రియ సాగాలని, అందుకు అనుగుణంగా ప్రతి ఆటోకు స్పష్టమైన రూట్ మ్యాప్‌లను తక్షణమే తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే నగరంలో నూతనంగా చేపడుతున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం త్వరలోనే పూర్తికానున్న నేపథ్యంలో,



తాత్కాలికంగా ఈ-ఆటోలకు దూరం తగ్గించి, ఎక్కువ ట్రిప్ లు కలిసేలా సేకరించిన చెత్తను హెవీ లోడర్లకు షిఫ్ట్ చేయడానికి తగిన స్థలాలను పరిశీలించి నివేదిక అందించాలని సూచించారు.దీంతో పాటు, సేకరించిన చెత్త బరువును ఖచ్చితంగా నమోదు చేసేందుకు గాను ఏటుకూరు గార్బేజ్ పాయింట్ వద్ద అదనంగా మరో వే-బ్రిడ్జిని వెంటనే నిర్మాణం చేయాలని డిఈఈని ఆదేశించారు.

# ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన డీఎంహెచ్ఓ

**గుంటూరు, రాజధాని వాయిస్** : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, గుంటూరులో మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO) డా. వీ.పద్మావతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ DMHO, Dr. E. అన్నపూర్ణ , DPMO DR.సుజాత, DPO,DR. శ్రీధర్,DFO DR. గిరిధర్ మరియు జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (DMHP) నోడల్ అధికారి డా. మౌనిక పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి సమగ్ర ఆరోగ్యంలో కీలక భాగమని తెలిపారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిద్రలేమి, వ్యసనాలు వంటి మానసిక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు.మానసిక ఆరోగ్య సమస్యలపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మానసిక సమస్యలు కూడా ఇతర ఆరోగ్య సమస్యల మాదిరిగానే చికిత్స పొందగలవని, బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు, స్నేహితులు అండగా నిలవాలని పేర్కొన్నారు.జిల్లా మానసిక




ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రజలకు మానసిక ఆరోగ్య సేవలు, కౌన్సెలింగ్ మరియు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఆరోగ్య సమస్యలపై సహాయం అవసరమైన వారు టెలీ-మానస్ 14416 హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని సూచించారు.ఈ సందర్భంగా "మానసిక ఆరోగ్యం -- ప్రతి ఒక్కరి హక్కు, ఆరోగ్యకరమైన సమాజానికి పునాది" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం సిబ్బంది పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా మాంసం, చేపల విక్రయాలు బంద్

**గుంటూరు, రాజధాని వాయిస్** : ఈ నెల 2వ తేదీ (శుక్రవారం) గాంధీ జయంతి సందర్భంగా గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాంసం, చేపల విక్రయాలు పూర్తిగా నిషేధిస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాంధీ జయంతి రోజున మాంసం, చేపల విక్రయాలపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని మాంసం, చేపల విక్రయ దుకాణాలతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లకు కూడా ఈ నిషేధ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు.నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఇప్పటికే నగరపాలక సంస్థ సిఎంఓహెచ్ ద్వారా నగరంలోని అన్ని డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే మాంసం, చేపల విక్రయ దుకాణానికి నిషేధానికి సంబంధించిన నోటీసులు అందించారని తెలిపారు.నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు నగరపాలక సంస్థ ఆదేశాలకు సహకరించి నిషేధాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు.




# వర్చువల్ లైకులు కాదు... నిజ జీవితంలో సాధించే విజయమే ముఖ్యం

## విద్యార్థులతో ముఖాముఖిలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

## ఎం ఏ ఎం కాలేజీలో ఉత్సాహంగా సాగిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమం

**నరసరావుపేట, రాజధాని వాయిస్** స్థానిక కేశానుపల్లి గ్రామం లోని ఎం ఏ ఎం కాలేజీ నందు నిర్వహించిన »Zen Gµ ప్రత్యేక కార్యక్రమం ఎంతో ఘనంగా, విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఓపిగ్గా సమాధానమిస్తూ, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రాముఖ్యతను ఎంతో చక్కగా వివరించి వారి భవితకు భరోసానిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత కేవలం భవిష్యత్తు కోసం ఎదురు చూసే తరం కాదని, సరికొత్త భవిష్యత్తును తమ ప్రతిభతో నిర్మించే శక్తివంతమైన తరమని కొనియాడారు. చదువు, నైపుణ్యం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం అనే పంచసూత్రాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కేవలం అకడమిక్ డిగ్రీ పట్టాతోనే సరిపెట్టుకోకుండా కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్, ఇంగ్లీష్, డిజిటల్ స్కిల్స్ వంటి ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ఏఐ సాంకేతికత వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం వీడి, దానిని సాధనంగా ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవాలన్నారు. అలాగే కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూడటమే కాకుండా ఎంట్రప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియాలో కనిపించే తాత్కాలిక విజయాలకే పరిమితం కాకుండా నిజ జీవితంలో సాధించే వాస్తవమైన విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా వాస్తవాలు నిర్ధారించుకున్న (ఫ్యాక్ట్-చెక్) తర్వాతే స్పందించాలని చెప్పారు. సమయం ఎంతో విలువైనదని, రోజులో కొంత సమయాన్ని చదువు, నైపుణ్య సాధన, వ్యాయామం, కుటుంబం కోసం తప్పనిసరిగా కేటాయించాలన్నారు. మంచి పౌష్టికాహారం, నిత్య వ్యాయామం, తగినంత నిద్రతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఒక్క తప్పుడు నిర్ణయం జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరిస్తూ



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. సంపాదన, పొదుపు, సరైన పెట్టుబడులపై అవగాహన పెంచుకుంటూ అనవసరపు అప్పుల బారిన పడకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, ఓటు హక్కుతో ప్రజాస్వామ్య నిర్మాణంలో బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. జీవితంలో పరీక్షలు, ఉద్యోగం లేదా వ్యాపారాల్లో ఎదురయ్యే ఎదురుదెబ్బలకు కుంగిపోకుండా వైఫల్యాలనే విజయానికి పునాదులుగా మలచుకోవాలని, విద్యార్థులు సాధించే ఉన్నతి వారి కుటుంబానికి, సొంత గ్రామానికి, నియోజకవర్గానికి మరియు దేశానికి ఉపయోగపడేలా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ పక్రుద్దీన్, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) పాల్గొని విద్యార్థులతో ముఖాముఖిలో భాగస్వాములయ్యారు. ఎం ఏ ఎం విద్యాసంస్థల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు నడిపించగా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రసాదరావు మాట్లాడుతూ యువత ప్రతి రంగంలోనూ ముందుండాలని ఉద్బోధించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ రవితేజ తో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే పేదలకు అసలైన భరోసా..

## గత వైసీపీ ప్రభుత్వంలో అంతా మోసమే:రాష్ట్ర మైనారిటీ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్

## 3వ వార్డు నిమ్మతోటలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ

**నరసరావుపేట, రాజధాని వాయిస్** స్థానిక పార్టీ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మర్యాదపూర్వకంగా కలిసి సాదర స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని 3వ వార్డు నిమ్మతోట ప్రాంతంలో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర మైనారిటీ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, గుంటూరు మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర లతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం పేరుతో ప్రజలను తీవ్రంగా వంచించారని మండిపడ్డారు. గత పాలకులు పింఛన్ల పెంపు విషయంలో ప్రజలను మోసం చేస్తూ అరకొర మొత్తాలతో కాలయాపన చేశారని, ఎందరో అర్హులైన పేదల పింఛన్లను సైతం అన్యాయంగా రద్దు చేశారని విమర్శించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం



అధికార ంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి, పింఛను మొత్తాన్ని భారీగా పెంచి ఒకటో తేదీనే నేరుగా లబ్ధిదారుల చేతుల్లో పెడుతో ందని కొనియాడారు. పేదలు, మైనారిటీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు పారదర్శ కంగా అందుతాయని పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com